క్లుప్తంగా

అలరించిన కోలాట ప్రదర్శన



ఎలకుర్రు(పామర్రు): గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో శనివారం ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శనను నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. తొలుత ఆలయంలో స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలను నిర్వహించారు. కోలాట గురువు భక్తి గీతాలను ఆలపించగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. అనంతరం ఆలయ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు, కోలాట బృందానికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ముదిగొంట శాస్త్రి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ



గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్ సీఎం కప్ టోర్నమెంట్‌లో కృష్ణాజిల్లా ఖో ఖో జట్టు ప్రతిభను ప్రదర్శించి ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మడకా ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు తిరుపతి పట్టణంలో జరిగిన ఈ పోటీల్లో ఖోఖో మహిళల విభాగంలో తమ జట్టు రెండో స్థానం సాధించిందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో కె.కుమారి, చైతన్య, భవాని, అఖిల అత్యంత ప్రతిభను కనబర్చి విజయానికి దోహదపడ్డారన్నారు. ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, చీఫ్ కోచ్‌లు సిరాజ్, ఝాన్సీరాణి తదితరులు అభినందించారు.

కాలువల్లో పూడిక తీత



మండవల్లి: మండలంలోని అయ్యవారి రుద్రవరం గ్రామంలో ఉపాధి నిధులతో పంట కాలువ అభివృద్ధి పనులు శనివారం నిర్వహించారు. రూ.లక్ష 90 వేల అంచనా విలువతో 89 మంది ఉపాధి కూలీలు పనులు చేసినట్లు ఎంటీఏ నవీన్ చెప్పారు. ఈ పనుల ద్వారా కూలీలకు ఎంతో వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. పశువులకు తాగునీటి కొరత తీరుతుందని పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

గుడివాడరూరల్: పట్టణంలోని సత్యనారాయణపురంలోని కృష్ణ రెసిడెన్సీ వద్ద ఏప్రిల్ 20వ తేదీన జరిగిన వివాదంలో అపార్టుమెంట్ వాచ్‌మెన్‌పై దాడి చేసిన కేసులో నిందితుడు మున్సిపల్ వర్కర్ నీలాపు భవానీశంకర్‌ను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు టూటౌన్ సీఐ బి.తులసీధర్ తెలిపారు. కృష్ణ రెసిడెన్సీ వద్ద విధుల్లో ఉన్న అపార్టుమెంట్ వాచ్‌మెన్ మల్లిఖార్జునరావుకు మున్సిపల్ వర్కర్ నీలాపు భవానీశంకర్‌కు వాగ్వివాదం చోటు చేసుకుంది. భవానీశంకర్, మల్లిఖార్జునరావుపై దాడి చేశాడని తెలిపారు. బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ తులసీధర్ కేసు నమోదు చేశారు. నిందితుడు భవానీశంకర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తులసీధర్ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

గుడివాడ రూరల్: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై అత్యాచారయత్నం చేసిన కేసులో నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్టు గుడివాడ టూటౌన్ సీఐ బి.తులసీధర్ తెలిపారు. వివరాల ప్రాకంర.. పట్టణంలోని సత్యనారాయణపురంలో ఈనెల 1వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై బత్తిన ఫణికుమార్ అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చే లోపు ఫణికుమార్ పరారయ్యాడు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడైన ఫణికుమార్‌ను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14రోజులు రిమాండ్ విధించారని సీఐ వివరించారు.

సర్పంచ్ గైర్హాజరుతో నిలిచిన సమావేశం

మండవల్లి: కానుకొల్లులో శనివారం నిర్వహించాల్సిన గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిలిచిపోవటంపై ఎంపీటీసీ సభ్యురాలు పుట్టి మీనాకుమారి, ఉప సర్పంచ్ కుందేటి నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ తమతోపాటు తొమ్మిది మంది సభ్యులు సమావేశానికి 10 గంటలకు హాజరైనట్లు పేర్కొన్నారు. 12 గంటల వరకు సర్పంచ్ రాకపోవటంతో అప్పటివరకు చూసి సభ్యులు వెళ్లిపోయినట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌తో సమావేశం ఏర్పాటు చేయవలసినదిగా కార్యదర్శి రత్నకుమారిని కోరినప్పటికీ ఆమె పట్టించుకోలేదని పేర్కొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి సారించండి

ఎమ్మెల్యే డీఎన్నార్



సమావేశంలో పనులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అధికారులు, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నాలుగు మండలాల్లో సచివాలయాలకు రూ.20 లక్షల అభివృద్ధి నిధులు కేటాయించామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ అవసరాలను గుర్తించి అంచనాలు రూపొందించి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిశెట్టి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, విద్యుత్‌శాఖ ఏఈలు రవికుమార్, మల్లిఖార్జున, నాగేశ్వరరావు, సత్యనారాయణ, పంచాయతీరాజ్ అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

కైకలూరు: జంగంపాడు చల్లాలమ్మ జాతరలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. గరక డప్పుల వాయిద్యకారుల ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, గ్రామ పెద్దలు కొల్లాటి శ్రీను, మైలు కొండయ్య, సిద్దాబత్తుల సతీష్, కొప్పనాతి వీరాంజనేయులు, కొప్పనాతి పెద్దిరాజులు, కొప్పనాతి శ్రీను, మారగాని శ్రీను, చల్లాలమ్మ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

డీఎల్‌డీఓ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ సుబ్బారావు, పక్కన ఎంపీపీ పుష్పరాణి

గుడివాడ రూరల్: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) కేఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులు, సచివాలయ ఉద్యోగులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథి డీఎల్‌డీఓ సుబ్బారావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల బాధ్యత కీలకమైందన్నారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం గత నాలుగేళ్ల కాలంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి నిరుపేదకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి అందజేసిందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత అధికారులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ అనగాని వెంకటరమణ, ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలుడికి విశేష పూజలు

పామర్రు(తోట్లవల్లూరు): మండలంలోని బొడ్డపాడు గ్రామంలో రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామికి వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్స విగ్రహాలకు గ్రామంలో అంగరంగ వైభవంగా ఊరేగింపు జరిపారు. గ్రామంలోని ఇంటింటికి స్వామివారి ఊరేగింపు వెళ్లగా భక్తులు హారతులను అందించి కానుకలతో మొక్కలను తీర్చుకున్నారు. వంశపారంపర్య ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించామని ఆలయ అధికారి సువర్నాదేవి తెలిపారు. గ్రామంలో బక్తులు పాల్గొన్నారు.

‘పది’విద్యార్థుల ప్రతిభ

- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- అభినందిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

పామర్రు: పదో తరగతిలో పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆయా మండలాల విద్యాశాఖాధికారులు వివరాలు వెల్లడించారు. మండలాల వారీగా ఉత్తీర్ణత శాతాలను వివరించారు. పదో తరగతిలో పామర్రు మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. పామర్రు ఎంఈవో పి.విజయలక్ష్మి శనివారం వివరాలను వెల్లడించారు. మండలంలో మొత్తం 460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 280 మంది ఉత్తీర్ణులయ్యారని, 61 శాతం సాధించారని అన్నారు. జుఝవరంలోని ఉషోదయ హైస్కూల్‌లో 88 శాతం సాధించారని ప్రిన్సిపాల్ ఎండీ రఫీ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రూ.25 వేల చెక్కును బహూకరించారు. పామర్రులోని యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో 42 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 91 శాతం ఫలితాలను సాధించామని ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 600 మార్కులకుగాను మంచి మార్కులు సాధించిన విద్యార్థినికి రూ.25,558 పోత్సాహక నగదుని అందజేశామని అన్నారు. తోట్లవల్లూరు మండలంలో 216 మంది విద్యార్థులకు 116 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మకూరు ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నందివాడ మండలంలో..

గుడివాడ టౌన్ (నందివాడ): నందివాడ మండలంలోని 7 ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులలో లక్ష్మీ నరసింహపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు.మండలంలోని వెన్ననపూడి హై స్కూల్‌లో 57 మంది పరీక్షకు హాజరుకాగా 18 మంది, తమిరిశ హైస్కూల్‌లో 37 మందికి 24, పోలుకొండ 36 మందికి 21, పుట్టగుంట హైస్కూల్‌లో 30 మందికి 12 మంది, నందివాడ హైస్కూల్‌లో 66 మందికి 28 మంది, రుద్రపాక హైస్కూల్‌లో 69 మందికి 33 మంది, లక్ష్మీనరసింహపురం హైస్కూల్‌లో 20 మందికి 11 మంది ఉత్తీర్ణులయ్యారు. నందివాడ మండలంలో మొత్తం 315 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 147 మంది ఉత్తీర్ణులై 47 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ పి.విజయలక్ష్మి తెలిపారు.

బాలికలదే పైచేయి

గుడివాడ టౌన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలోని 6 హైస్కూల్స్ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలదే పైచేయిగా ఉంది. ఈ పరీక్షల్లో స్థానిక ఏజీకే హైస్కూల్, ఏకేటీపీ బాలికల హైస్కూల్ బాలికలు ప్రతిభ చూపారు. ఏజీకే హైస్కూల్‌లో 50 మంది పరీక్షకు హాజరుకాగా 43 మంది, ఏకేటీపీలో 101 మందికి 74 మంది, ఆంధ్రనలంద హైస్కూల్‌లో 82 మందికి 52 మంది, ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో 69 మందికి 43 మంది, బేతవోలు హైస్కూల్‌లో 57 మందికి 32 మంది, టౌన్ హైస్కూల్‌లో 56 మందికి 26 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 415 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 270 మంది ఉత్తీర్ణులై 66.06 శాతం ఉత్తీర్ణత సాధించారు.

విద్యార్థుల ప్రతిభ..

స్థానిక విద్యాలయ హైస్కూల్‌లో విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ పి.రామచంద్ర శేఖర్ తెలిపారు. ఉషోదయ పబ్లిక్ స్కూల్‌లో ఉత్తీర్ణతలో విద్యార్థులు మంచి ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ తుమ్మల రత్న తెలిపారు. విశ్వవిజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాంబాబు తెలిపారు. స్థానిక త్రివేణి పబ్లిక్ స్కూల్‌లో 78 మంది పరీక్షకు హాజరుకాగా 70 మంది ఉత్తీర్ణత సాధించారు. మంచి మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివశంకర్ తెలిపారు.

గుడివాడ టౌన్: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ కరస్పాండెంట్ వీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో మంచి మార్కులు సాధించారన్నారు. ప్రతిభను కనపర్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు యాజమాన్యం అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు..

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభను ప్రదర్శించి ఉత్తమ ఫలితాలు సాధించారని విశ్వభారతి విద్యాసంస్థల అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణ శనివారం తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మొవ్వ మండలంలో 70 శాతం

మొవ్వ: మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి పరీక్షలకు 443 మంది విద్యార్థులు హాజరుకాగా 308 మంది పాసై 70 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. మండలంలో 220 మంది బాలురకు 134 మంది, 223 మంది బాలికలకు 174 మంది ఉత్తీర్ణులయ్యారు. మండల పరిధిలోని చినముత్తేవి జెడ్పీహెచ్ స్కూల్‌లో 22 మంది విద్యార్థులు పాసై 100 శాతం ఉత్తీర్ణత శాధించగా, కూచిపూడి 89 శాతం, కాజ 80 శాతం, పెడసనగల్లు 75 శాతం, పెదముత్తేవి 75 శాతం, మొవ్వ 71 శాతం, భట్లపెనుమర్రు 62 శాతం, కోసూరు 48 శాతం, నిడుమోలు 40 శాతం సాధించారు. కాజ ఎస్‌పీఎస్ఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. మండలంలో ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు.

గుడ్లవల్లేరు మండలంలో..

గుడ్లవల్లేరు: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో గుడ్లవల్లేరు మండలంలో 499 మందికి 272 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంఈఓ సుబ్రహ్మణ్యం శనివారం వివరాలు వెల్లడించారు. వడ్లమన్నాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రభుత్వ హైస్కూల్స్‌లో ప్రతిభ చూపారని ఎంఈఓ చెప్పారు.గుడ్లవల్లేరు ఏఏఎస్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులుమంచి ఉత్తీర్ణత సాధించారని హై స్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి తెలిపారు.

పెదపారుపూడి మండలంలో 63 శాతం

పెదపారుపూడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 63 శాతం మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారని ఎంఈవో బి.శ్రీనివాస్ శనివారం తెలిపారు. మండలంలో 231 మంది పరీక్షలకు హాజరు కాగా వారిలో 145 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారన్నారు. మండలంలోని వెంట్రప్రగడ హైస్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని వివరించారు.

51 శాతం ఉత్తీర్ణత

మండవల్లి: మండలంలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 340 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవగా 173 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ కే సురేష్‌కుమార్ శనివారం చెప్పారు. 51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. చింతపాడు హైస్కూల్‌లో 42 మందికి 12 మంది, మండవల్లి హైస్కూల్‌లో 74 మంది పరీక్షలకు హాజరు కాగా 35 మంది, లింగాల హైస్కూల్‌లో 14 మందికి 8 మంది, కానుకొల్లులో 17 మందికి 11 మంది, పుట్లచెరువులో 10 మందికి ఏడుగురు, ఇంగిలిపాకలంకలో 15 మందికి నలుగురు, లోకుమూడిలో 18 మందికి 13 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ తెలిపారు.

పది ఫలితాల్లో 40 శాతం ఉత్తీర్ణత

ముదినేపల్లి రూరల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 40 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 8 జెడ్పీ హైస్కూళ్ల నుంచి 432 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగాకేవలం182 మాత్రమే ఉత్తీర్ణుల య్యారు. మండలంలోని పెదగొన్నూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు 75 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. అత్యల్పంగా చిగురుకోట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 12 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు. ఈ పాఠశాల నుంచి 33 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా నలుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. తర్వాత స్థానాల్లో పెదపాలపర్రు హైస్కూల్ 50 శాతం, వడాలి హైస్కూల్ 45 శాతం, ముదినేపల్లి హైస్కూల్ 42 శాతం, బొమ్మినంపాడు హైస్కూల్ 36 శాతం, అల్లూరు హైస్కూల్ 33 శాతం, గురుజ హైస్కూల్ 25 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నాయి.

పదిలో బాలికలదే హవా..

కైకలూరు: పది పరీక్షల్లో మండలంలో బాలికలు హవా కొనసాగింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షల్లో 8 ప్రభుత్వ పాఠశాలలు, 9 ప్రైవేటు పాఠశాలల నుంచి బాలురు 429, బాలికలు 389 వెరసి మొత్తం 818 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 256 మంది బాలురు, 269 బాలికలు మొత్తం 525 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌కు సంబంధించి 17 హైస్కూల్స్‌లో 12 మంది బాలికలు, ఐదుగురు బాలురు మంచి స్థానాలు సాధించారు. తల్లిదండ్రులు ,అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

తహసీల్దార్ ఆంజనేయులు

గుడివాడరూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ కె.ఆంజనేయులు కోరారు. మండలంలోని రామనపూడి గ్రామంలో ఎంపీడీవో వెంకటరమణతో కలసి శనివారం తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు, సిబ్బంది పూర్తి సహకారం అందించాలన్నారు. ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల విషయంలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి లబ్ధిదారులు తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మీగడ మురళీధర్, సచివాలయ ఉద్యోగులు, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదానానికి దాత శనివారం విరాళం అందించారు. మండలంలోని వడాలికి చెందిన వీరమల్లు వెంకటసత్యనారాయణ, రత్నకుమారి దంపతుల కుమారుడు ఖేదర్ ఆలయంలో జరిగే అన్నదానానికి రూ.25,116 విరాళాన్ని కార్యాలయంలో చైర్మన్ శొంఠి నాగరాజుకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, పాలక వర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ రాజామణి

పామర్రు(తోట్లవల్లూరు): ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న రొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. తోట్లవల్లూరు మండలం తోట్లవల్లూరు-1 వైఎస్సార్ ఆర్‌బీకే వద్ద రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతు ప్రభుత్వమని అన్నారు. మండల వ్యవసాయ అధికారి జీ నాగేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో 2023 ప్రీ ఖరీఫ్ సీజనుకు జీలుగ 123 క్వింటాళ్లు వచ్చాయని అన్నారు. పూర్తిఖరీదురూ.79 కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.39.50 ధరకు అందిస్తున్నామన్నారు. పిల్లి పెసర 6 క్వింటాళ్ల పూర్తి ఖరీదు రూ.97 రాయతీ పోను రూ.48లకు అందిస్తున్నామన్నారు. జనుము 11.50 క్వింటాళ్లు స్టాకు వచ్చిందన్నారు. పూర్తి ఖరీదు రూ.84 కాగా రాయితీ పోను రూ.42లకు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో నార్త్ వల్లూరు డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం చైర్మన్ గొనేపల్లి శ్రీనివాసరావు, కిలారపు గంగాధరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు



సోమేశ్వరస్వామికి పట్టువస్త్రాలు తీసుకువెళుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీపార్వతిసమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు శనివారం జరిగిన అన్నసమారాధనతో ముగిశాయి. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఈ కార్యక్రమంలో పాల్గొనగా ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ గుల్లిపల్లి సుధారాణి, సర్పంచ్ శీలం రామకృష్ణ, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సతీష్‌బాబు స్వాగతం పలకగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి ఎమ్మెల్సీకి తీర్థప్రసాదాలు అందజేసిన అనంతరం సమారాధన ప్రారంభించారు. 2 వేల మందికి పైగా భక్తులు సమారాధనలో పాల్గొన్నట్లు ఈవో, చైర్మన్ తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్‌బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య సమారాధనలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా శేషుబాబు, సాక్షి సాయిబాబు, శీలం వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, పెరుమాళ్ళ రత్నకామేశ్వరరావు, రాచూరి కుమార్, పేరే రామకృష్ణ, శొంఠి నాగరాజు, రంగిశెట్టి కొండా, దివి సతీష్, పేతు రాజా, చలసాని లక్ష్మీపార్వతి, కుర్మా మహేష్ బాబు, బత్తుల నాని, శీలం వెంకటేశ్వరరావు, గులిశెట్టి కృష్ణారావు, శీలం వీరాంజనేయులు, బోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

గుడివాడ టౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ బాధ్యులు టి.ప్రవల్లిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, క్రాఫ్ట్, కథలు, వివిధ రకాల సృజనాత్మక కార్యక్రమాలపై శిక్షణ ఉంటుందన్నారు. చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పఠనాశక్తిని, సృజనాత్మకతను పెంపొందింప చేసుకోవాలని కోరారు.

నేడు గోడౌన్ నిర్మాణానికి భూమిపూజ

గుడ్లవల్లేరు: అంగలూరులో పీఏసీఎస్‌కు ఆధ్వర్యంలో రూ.29.75 లక్షలతో గోడౌన్ నిర్మించనున్నారు. ఈ గోడౌన్ నిర్మాణానికి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం భూమిపూజ చేయనున్నట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు శనివారం తెలిపారు. అనంతరం రూ.17 లక్షల నిధులతో వెణుతురుమిల్లిలో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

రూ.81 లక్షలతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదన

ముదినేపల్లి రూరల్: మండలంలోని కాకరవాడ శివారు దేవరం వెళ్లే అన్నవరం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసినట్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య ముదినేపల్లిలో శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రెయిన్‌పై ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనాల రద్దీ వల్ల గత నెలలో కూలిపోయిందన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు తెలియజేశామన్నారు. ఎమ్మెల్యే సత్వరమే స్పందించి సమస్యను కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. స్పందించిన అధికారులు రూ.81 లక్షల వ్యయంతో నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసినట్లు చెప్పారు. సమస్య తాత్కాలికంగా పరిష్కరించుకునేందుకు రహదారి నిర్మాణం కోసం ఎమ్మెల్యే సూచనల మేరకు మండల పరిషత్ నిధులను కేటాయించడంతో పాటు స్థానిక రైతుల సహకారంతో తాత్కాలికంగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విష్ణుప్రసాద్

గుడివాడ టౌన్(నందివాడ): మండల గ్రామాల్లో మురుగు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని, శానిటేషన్‌పై శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ అన్నారు. మండల కార్యాలయంలో శనివారం గ్రామాల కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విపత్తు నివారణ సంస్థ సూచనల మేరకు రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేకించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని క్లోరినేషన్, శానిటేషన్‌లపై శ్రద్ధచూపాలన్నారు. ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు వహించాలని అన్ని సమయాల్లో కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు.

తీర్పుపై అవగాహన కల్పించండి

చిలకలపూడి(మచిలీపట్నం): సుప్రీంకోర్టులో 50 సంవత్సరాల కిందట ఇచ్చిన తీర్పు వివరాలను న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్న వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కేశవానంద భారతి కేరళ రాష్ట్ర ప్రభుత్వంపై వేసిన కేసులో 13 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం 1973 ఏప్రిల్ 24వ తేదీన తీర్పును వెలువరించిందన్నారు. ఈ తీర్పులో రాజ్యాంగం మౌలిక సూత్రాలకు భంగం కలిగించరాదని సూచించారని చెప్పారు. న్యాయమూర్తులు డాక్టర్ షేక్ మొహమ్మద్ ఫజులుల్లా, చినబాబు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం. రామకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల శివరామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.